చిరువ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

ఎమ్మెల్యే కృష్ణారావు



పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

సనత్‌నగర్: ఎన్నో ఏళ్లుగా ఫుట్‌పాత్‌లపై డబ్బాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న నిరుపేదలను జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు ఇబ్బందులు పెట్టడం సరికాదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఉపాధిని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారంటూ ఫుట్‌పాత్ వ్యాపారులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. గురువారం ఆయన పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్ ప్రాంతంలో పర్యటించారు. కనీసం సమయం కూడా ఇవ్వకుండా తమ డబ్బాలను తొలగించారని చిరువ్యాపారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ట్రాఫిక్ ఏసీపీతో ఫోన్‌లో మాట్లాడారు. చిరువ్యాపారుల జోలికి వస్తే సహించేది లేదన్నారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా వ్యాపారాలు చేసుకుంటారని, వారికి ఇబ్బందులు కలిగించవద్దన్నారు. మరోసారి వారిని ఇబ్బందులు పెట్టేలా వ్యవహరిస్తూ వారి ఉపాధిని దెబ్బతీస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, నాయకులు సురేష్‌కుమార్‌యాదవ్, రాజయ్య, లక్ష్మీ, పేపర్ శ్రీను, శ్రీశైలం, ప్రవీణ గంగారం, సాయిగౌడ్, బీరస్వామి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ. 18 వేలు వేతనం ఇవ్వాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

బన్సీలాల్‌పేట్: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 18 వేలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 31న ఇందిరాపార్కు వద్ద జరిగే ఆశా వర్కర్ల బస్సు జాతా ముగింపు సభ పోస్టర్‌ను గురువారం ఐడిహెచ్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రం ఆవరణలో సీఐటీయూ సనత్‌నగర్ జోన్ కన్వీనర్ పి. మల్లేష్ ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆశా వర్కర్ల వేతనాన్ని రూ.18 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆశా వర్కర్ల అనేక సమస్యలను పరిష్కరిస్తానని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అనంతరం వాటిని విస్మరించిందన్నారు. ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఆశావర్కర్ల వేతనాన్ని రూ.18 వేలు పెంచాలని కోరారు. ఆశా వర్కర్ల పనిభారాన్ని తగ్గించాలని, ఈఎస్ఐ, పీఎఫ్‌లతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31న ఇందిరాపార్కు వద్ద జరిగే సభలో పెద్ద ఎత్తున ఆశా వర్కర్లు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి అనిత, వెంకటమ్మ, పద్మ, సుశీల, మహేశ్వరి, వరలక్ష్మీ, నందిని పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే కంటోన్మెంట్ అభివృద్ధి



భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న రామకృష్ణ

కంటోన్మెంట్: కేంద్ర ప్రభుత్వం నిధులతోనే కంటోన్మెంట్లో అభివృద్ధి కొనసాగుతుందని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. గురువారం కంటోన్మెంట్ ఆరో వార్డు పరిధిలోని జవహర్ రైల్వే కాలనీ, జూపిటర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించడం లేదన్నారు. స్థానిక పన్నులు, కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కంటోన్మెంట్ వ్యాప్తంగా అన్ని వార్డులు కాలనీలలో ఏ చిన్న సమస్య అయినా, తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో కంటోన్మెంట్ కు అధిక మొత్తంలో నిధులు సమకూరే అవకాశం ఉందన్నారు. ఆ నిధులతో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు బీజేపీ అధ్యక్షుడు అజయ్ గౌడ్, బీజేపీ నాయకులు ప్రతీక్, రవీందర్ రెడ్డి, కాలనీవాసులు మహేష్, ప్రసాద్, తిరుపతి, రమేష్, చంద్రశేఖర్, సుధాకర్, కార్తీక్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవం



ఎర్ర జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

లాలాపేట: సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం తార్నాక మున్సిపల్ డివిజన్‌లో ఆ పార్టీ నేతలు సీపీఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తార్నాక చౌరస్తాలో తార్నాక డివిజన్ సెక్రటరీ ఎస్‌కే లతీఫ్ ఎర్ర జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఎర్ర జెండా ఎల్లప్పుడు అండగా నిలుస్తుందన్నారు. భూ పోరాటంలో ఎంతో మందికి భూములు పంచిన ఘనత ఎర్ర జెండాకే దక్కుతుందన్నారు. పేద, కార్మిక వర్గానికి ఎర్ర జెండా ఎప్పుడూ తోడుగా నిలుస్తుందన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో నిస్వార్థంగా సేవలందించే పార్టీ సీపీఐ మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ నియోజకవర్గం సీపీఐ సహాయ కార్యదర్శి ఎండీ ఉమర్‌ఖాన్, ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు బెజ్జాల కృష్ణమూర్తి, పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో ఓయూ విద్యార్థి నేతలకు చోటు



జీవన్



సుమన్ శంకర్



డా.జంగం పాండు



అలివేలి రాజు

ఉస్మానియా యూనివర్సిటీ: ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో ఓయూ విద్యార్థి నాయకులకు చోటుదక్కింది. సిద్దిపేటలో ఈనెల 25 వరకు జరిగిన 43వ రాష్ట్ర మహాసభల్లో పలువురు ఓయూ విద్యార్థి నేతలకు రాష్ట్ర నూతన కమిటీలో అవకాశం కల్పించారు. ఏబీవీపీ ఆల్ యూనివర్సిటీస్ స్టేట్ కన్వీనర్‌గా జీవన్, స్టేట్ టెక్నికల్ సెల్ ప్రముఖ్‌గా ఎం.సుమన్ శంకర్, స్టేట్ ఖేల్ (క్రీడా) ప్రముఖ్ డాక్టర్.జంగం పాండు, రాష్ట్ర సంయుక్త కారదర్శిగా అలివేలి రాజు, వర్కింగ్ కమిటీ సభ్యులుగా కమల్ సురేష్, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులుగా శేఖర్, హరిప్రసాద్, కళ్యాణ్ నియమితులయ్యారు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

పలువురికి గాయాలు.. ఐదుగురి రిమాండ్



మద్యం మత్తులో గొడవ పడుతున్న యువకులు

అడ్డగుట్ట: స్నేహితుడి బర్త్‌డే పార్టీకి వెళ్లిన యువకులు మద్యం మత్తులో ఘర్షణ పడడంతో పలువురికి తీవ్ర గాయాలైయ్యాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేసి ఐదుగురిని రిమాండ్‌కు తరలించిన సంఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుంది. ఇన్‌స్పెక్టర్ రఘుబాబు తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భూపాలపల్లికి చెందిన సుమన్ తార్నాక విజయపురికాలనీలోని ఓయో రూమ్(హ్యాపీ హోమ్)లో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 25న తన జన్మదినం సందర్భంగా ఓయో రూమ్‌లో పార్టీ ఏర్పాటు చేసి తన స్నేహితులైన చందు నాయక్, యువ నాయక్, భాగ్యరాజ్, శ్రావణ్, కనిష్కలను పిలిచాడు. ఈ క్రమంలో మద్యం సేవించిన తరువాత వారు ఒకరికి ఒకరు దూషించుకున్నారు. ఈ గొడవలో మాటామాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూ రూంలో నుంచి గేటు బయటకు వచ్చి రాళ్లు విసురుకున్నారు. ఈ ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గొడవ పడుతున్న యువకులను అదుపులోకి తీసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. వీరిలో భాగ్యరాజ్‌పై ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్లు తెలిపారు. శ్రావణ్ యువకుడు పరారీలో ఉన్నాడని పోలీసులు చెప్పారు.

క్రీడా మైదానాలపై నిర్లక్ష్యం

- వృథాగా ఓయూ గ్రౌండ్స్
- అద్దెలు రాకపోవడంతో వర్సిటీ ఆదాయానికి గండి



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని వివిధ క్రీడా మైదానాల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వందలాది ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్న వివిధ మైదానాలకు సరైన నిర్వహణ లేక క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారుతున్నాయి. వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో బయట వ్యక్తులు ఉచితంగా వాడుకుంటుంటంతో యూనివర్సిటీకి అద్దెల ద్వారా వచ్చే ఆదాయానికి గండి పడుతుందని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. యూనివర్సిటీ వ్యాయామ విద్య కళాశాలకు అనుబంధగా కొనసాగుతున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ పరిధిలో వివిధ ఆటలకు సంబంధించిన క్రీడా మైదానాలు, కోర్టులు కొనసాగుతున్నాయి. క్యాంపస్‌లోని 9 కాలేజీలతో పాటు అనుబంధ పీజీ కాలేజీలు నిజాం, సైఫాబాద్, సికింద్రాబాద్ పీజీ కాలేజీల విద్యార్థులకు ఆటలను ఆడించేందుకు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు (పీడీ)లు అసలే లేరు. దీంతో క్రీడా మైదానాలు, ఇతర ఆట స్థలాల నిర్వహణ కష్టతరంగా మారింది. క్రీడా మైదానాలలో మూడు కికెట్ గ్రౌండ్స్, హాకీ గ్రౌండ్, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, బాస్కెట్ బాల్, వాలీబాల్, హ్యాండ్ బాల్, ఖోఖో, కబడ్డీ బ్యాడ్మింటన్ టెన్నిస్, షటిల్ కోర్టులతో పాటు ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, వ్యాయామశాలు కొనసాగుతున్నాయి. బయటి వ్యక్తులు, సంస్థలకు అద్దెకు ఇవ్వడంతో ఓయూకు ప్రతి ఏడాది సుమారు రూ.20 నుంచి 30 లక్షల వరకు ఆదాయం సమకూరేదని విద్యార్థి నాయకులు పేర్కొంటున్నారు.



క్రికెట్ గ్రౌండ్



సింథటిక్ ట్రాక్



టెన్నిస్ కోర్టు

ఓయూ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్‌గా ప్రొ.విద్యాసాగర్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్‌గా ప్రొ.విద్యాసాగర్ నియమితులయ్యారు. క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్‌గా కొనసాగుతున్న ఆయన గతంలో వైస్ ప్రిన్సిపాల్‌గా, బీవోఎస్‌గా తదితర పదవులను చేపట్టారు. వచ్చే నెల 26న ఢిల్లీలో జరిగే రిప్లబిక్ వేడుకల్లో పాల్గొనేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 16 మంది ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

యువతి అదృశ్యం



ఎస్.సునైన. (ఫైల్)

లాలాపేట: యువతి అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.... సితాఫల్‌మండి రవీంద్రనగర్‌కు చెందిన కూరగాయల వ్యాపారి సురేష్‌కు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం సురేష్ తన వ్యాపారం నిమిత్తం బయటకు వెళ్లగా అదేరోజు సాయంత్రం ఆయన చిన్న కుమార్తె సునైన (18) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. రాత్రి ఇంటికి వచ్చిన సురేష్‌కు సునైన కనిపించలేదు. తెలిసిన వారి వద్ద, చుట్టూ పక్కల వెతికినా ఫలితం లభించలేదు. దీంతో సురేష్ ఓయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌పీలను రెగ్యులరైజ్ చేయండి

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే శ్రీ గణేష్ విజ్ఞప్తి



కంటోన్మెంట్: పట్టణ ప్రాంతంలో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తూ మెప్మా ఆధ్వర్యంలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ)లను రెగ్యులర్ చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రిని కలిసి ఆర్పీల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. మహిళా సంఘాల బలోపేతానికి ఎన్నో ఏళ్లుగా ఆర్పీలు కృషి చేస్తున్నారని తెలిపారు. జీవో నెం. 60 ప్రకారం ఆర్‌పీలకు జీతభత్యాలు చెల్లించాలని, అలాగే వారికి రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్స్, కాంట్రాక్ట్ ఉద్యోగుల లకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 60 ప్రకారం ఆర్‌పీలకు జీతాలు చెల్లించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే బస్తీబాట



నాలుగో వార్డ్ హరిజన బస్తీలో పర్యటిస్తున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: ప్రజా సమస్యల పరిష్కారానికి బస్తీబాట నిర్వహిస్తున్నామని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. గురువారం పికెట్ అంబేడ్కర్ నగర్ హరిజన బస్తీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలోని డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్, రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశలవారీగా బస్తీలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే కంటోన్మెంట్ వ్యాప్తంగా 100కు పైగా బస్తీబాట కార్యక్రమాలు నిర్వహించి ఆయా బస్తీల్లోని సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. హరిజన బస్తీలో మలిదశ బస్తీ బాట నాటికి ప్రస్తుతం గుర్తించిన సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. త్వరలో కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో అన్ని వార్డులను భారతీయ జనతా పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఆ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ విజయానంద్, నాలుగో వార్డు అధ్యక్షులు రాజ మల్లేష్, పార్టీ సీనియర్ నాయకులు టోపీ శంకర్, నాగభూషణం రెడ్డి, సతీష్, సాయికుమార్, గంగారాం పాల్గొన్నారు.

ట్రాఫిక్ విధుల్లో ట్రాన్స్‌జెండర్లు..!

- వెస్ట్‌జోన్ పరిధిలో ఎనిమిది మంది కేటాయింపు
- ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సేవలు
- ఇప్పటికే సేవలందిస్తున్న హైడ్రా సిబ్బంది
- ట్రాన్స్‌జెండర్లు, హైడ్రా సిబ్బందితో కలిపి మొత్తం 40 మంది విధుల్లో



ట్రాన్స్‌జెండర్లకు సూచనలు ఇస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా

బంజారాహిల్స్: ట్రాఫిక్ విధుల్లో ట్రాన్స్‌జెండర్లు (ట్రాఫిక్ అసిస్టెంట్లు) విధులు నిర్వర్తిస్తున్నారు. రెండురోజుల క్రితం వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే ఎనిమిది మంది ట్రాఫిక్ అసిస్టెంట్లను కేటాయించారు. వీరు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్ పోలీసులకు సహాయకులుగా పనిచేస్తున్నారు. ఒక్కో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు చొప్పున కేటాయించారు. పంజగుట్ట, జూబ్లీహిల్స్, కేబీఆర్ పార్కు, మైత్రీవనం చౌరస్తాల్లో ప్రస్తుతం వీరు విధులు నిర్వహిస్తున్నారు. ట్రాన్స్‌జెండర్ల సేవలను వినియోగించుకోవాలని ప్ర భుత్వం నిర్ణయించడమే కాకుండా వారిని గుర్తించి ఇటీవలే శిక్షణ కూడా ఇచ్చారు. ట్రాఫిక్ విధి విధానా లు, వాహనదారుల పట్ల వ్యవహరించాల్సిన తీరు, ట్రాఫిక్ పోలీసులు అంటే ఏమిటి, సేవలు ఎలా వినియోగించుకోవాలి అన్న దానిపై ఈ శిక్షణ పూర్తయ్యింది. ఒక్కో పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు చొప్పున ప్ర ధాన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు వీరిని కేటాయించారు. కూడళ్లలో సిగ్నల్ జంపింగ్‌లు, రాంగ్‌రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, స్టాప్‌లైన్ దాటి ముందుకు రావడం తదితర ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వీరు దృష్టిపెడతారు. గత రెండు రోజులుగా ఆయా చౌరస్తాల్లో వీరు విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వీరు విధులు నిర్వహించనున్నారు.

కొనసాగుతున్న హైడ్రా సిబ్బంది సేవలు...

ట్రాఫిక్ విధుల్లో హైడ్రా సిబ్బంది సేవలు కూడా కొనసాగుతున్నాయి. ఒకవైపు ట్రాఫిక్ అసిస్టెంట్ల పేరుతో ట్రాన్స్‌జెండర్లు, మరోవైపు హైడ్రా సిబ్బంది ట్రాఫిక్ విధుల్లో పనిచేస్తున్నారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 32 మంది హైడ్రా సిబ్బంది ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. వీరు కూడా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విధుల్లో ఉంటున్నారు. ఇటు ట్రాఫిక్ అసిస్టెంట్లు, అటు హైడ్రా సిబ్బంది కలిసి మొత్తం 40 మంది వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో విధులు నిర్వహిస్తుండడంతో ఇక్కడ ట్రాఫిక్ పోలీసుల కొరత చాలావరకు తీరింది. ఈ సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతంలో స్టాప్‌లైన్ దాటి రాకుండా వాహనదారులను నియంత్రించడం, ఫ్రీలెఫ్ట్‌లో వాహనాలు సజావుగా సాగేందుకు తోడ్పడుతున్నారు. సిగ్నల్ జంపింగ్ చేస్తే వారిని గుర్తిస్తున్నారు. కేవలం ట్రాఫిక్ విధుల్లో అక్కడ ఉన్న ట్రాఫిక్ పోలీసులకు సహాయంగా ఉండాలని వీరికి ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి.



సాయంత్రం కూడా కొనసాగితే బాగుంటుంది..

ట్రాఫిక్ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రద్దీగా ఉంటుంది. అన్ని కూడళ్లు, రహదారుల్లో ఈ నాలుగు గంటలు ట్రాఫిక్ స్తంభించిపోతుంది. అయితే హైడ్రా సిబ్బంది, ట్రాన్స్‌జెండర్లు ఉదయం వేళ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో హైడ్రా సిబ్బంది కొంత మందిని సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విధుల్లో ఉంచితే ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయని స్థానికులు అంటున్నారు. ఫ్రీలెఫ్ట్‌లో వాహనాలు నిలపడం, సిగ్నల్ జంపింగ్‌లు, స్టాప్‌లైన్లు దాటి రావడం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ తదితర ట్రాఫిక్ ఉల్లంఘనలు సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు పంజగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పుడు ఉన్న ట్రాఫిక్ పోలీసులకు అసిస్టెంట్లుగా హైడ్రా సిబ్బందిని సాయంత్రం కూడా విధుల్లో ఉంచితే సమస్య కొంతమేర పరిష్కారం అవుతుందని ట్రాఫిక్ పోలీసులు కూడా భావిస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: సంజీవయ్యపార్కు, ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌లాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉ. 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బేగంపేట పాటిగడ్డ క్వార్టర్స్, కల్లు కాంపౌండ్ ఏరియా, ఎన్‌బీటీనగర్, ప్రకాష్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుక ప్రాంతం, చీకోటి గార్డెన్.
- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐసీఐసీఐ బ్యాంక్ లేన్, భగవంతాపూర్, గగన్‌విహార్ కాలనీ, షేర్‌ఖాన్ బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ రూ.18, పొడుగు వంకాయ రూ.18, బెండకాయ రూ. 23, పచ్చిమిర్చి రూ.35, బజ్జీమిర్చి రూ.35, క్యాప్సికమ్ రూ.47, పచ్చకాకర రూ.32, పందిరి బీర రూ.35, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.27, దొండ రూ.40, గుండుబీన్స్ రూ.45, గింజ చిక్కుడు రూ.35, గోకరకాయ రూ.28, కీర రూ.18, దోసకాయ రూ.15, బీట్‌రూట్ రూ.35, ఉల్లిగడ్డ రూ.35, ఆలుగడ్డ రూ.25, చామగడ్డ రూ.37, మొరంగడ్డ రూ.23, కందగడ్డ రూ.50, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.13, అరటి కాయ రూ.9, మునగకాయ రూ.4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఎమ్మెల్యే కార్యాలయంలో క్రిస్మస్ సంబరాలు



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు. బోయగూడలోని సెయింట్ ఫిలోమినా చర్చి ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు డిసిల్వా, సదాయ్‌రాజ్, జయరాజ్, నాయకులు వెంకటేషన్‌రాజు, అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీపతి, నామన సంతోష్‌కుమార్, కొప్పాల ఎలిజ, అబ్బాస్, నాగభూషణం, కుషాల్ పాల్గొన్నారు.

స్వెటర్లు, రగ్గుల పంపిణీ



సనత్‌నగర్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్, వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళలకు స్వెటర్లు, రగ్గులను పంపిణీ చేశారు. సనత్‌నగర్ స్వామి టాకీస్ వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వచ్ఛమైన రాజకీయం అంటేనే అటల్ బిహారీ వాజ్‌పేయిదే అన్నారు. ఆ యనను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. వెల్లాల రామ్మోహన్ మాట్లాడుతూ.. భావి తరాలకు స్ఫూర్తిదాయకమైన నేత అటల్‌జీ అన్నారు. కార్పొరేటర్ సరళ, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన



బౌద్ధనగర్: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని షీటీమ్ బృందం హెచ్చరించారు. గురువారం బౌద్ధనగర్ డివిజన్‌లోని వారాసిగూడలో షీటీమ్స్ హైద్రాబాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవ్ టీజింగ్, బ్లాక్ మెయిలింగ్, ప్రాంక్ కాల్స్, అసభ్య ప్రవర్తనలు వంటి వాటికి ఎవరైన పాల్పడితే వెంటనే అప్రమత్తమై షీ టీమ్స్‌ను సంప్రదించాలని సూచించారు. అదే విధంగా సోషల్ మీడియాకు సాధ్యమైనంత దూరంగా ఉండాలని, తెలియని వ్యక్తుల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం

పంజగుట్ట: చదువుతో పాటు పిల్లలకు క్రీడలు ఎంతో ముఖ్యమని, క్రీడలు క్రమశిక్షణతో ఎలా జీవనం గడపాలో నేర్పుతాయని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. మాజీ సీఎల్‌పీ నాయకుడు పి.జనార్దన్ రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి నిర్వహిస్తున్న పీజేఆర్ మెమోరియల్ డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్ గురు వారం సాయంత్రం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.ఎస్.మక్తాలోని ఈద్గా మైదానంలో జరుగుతున్న పోటీలు ఈ నెల 26 నుంచి 28 వరకు జరుగుతాయని తెలిపారు. విజేతలకు ఈ నెల 28వ తేదీన ఖైరతాబాద్ కూడలి వద్ద నిర్వహిస్తున్న పీజేఆర్ వర్ధంతి వేడుకల్లో బహుమతులు అందిస్తా మని తెలిపారు. మొదటి, రెండో బహుమతితోపాటు ఉత్తమ బ్యాట్స్‌మెన్, ఉత్తమ బౌలర్లకు కూడా నగదు, జ్ఞాపిక అందించనున్నట్లు ఆమె తెలిపారు.